సాక్షి సూర్యాపేట

గురువారం । 7 । ఆగస్టు । 2025



కృష్ణా తీరాన శైవ క్షేత్రం
నేరెడుగొమ్ము మండలంలోని పెద్దమునిగల్ కృష్ణా తీరంలో మహా శివుని ప్రతిమ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



ముగిసిన పవిత్రోత్సవాలు
యాదగిరి క్షేత్రంలో మూడు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు బుధవారం పరిసమాప్తం అయ్యాయి.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు		
ప్రస్తుత నీటి మట్టం	:	587.90 అడుగులు
ఇన్‌ఫ్లో	:	66,131 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	44,108 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	28,379 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	5,088 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	8,541 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

వక్ఫ్ భూముల వేలంపై హైకోర్టు స్టే



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ కమలాకర్

పాలకవీడు: పాలకవీడు గ్రామ రెవెన్యూ పరిధిలోని జాన్‌పహాడ్ దర్గా భూముల కౌలు వేలంపాటను తాత్కాలికంగా రద్దు చేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ కమలాకర్ తెలిపారు. బుధవారం పాలకవీడులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జాన్‌పహాడ్ దర్గాకు సంబంధించి వక్ఫ్‌కు చెందిన వివిధ సర్వే నంబర్లలోని 57 ఎకరాల 38 గుంటల భూములపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం వేలం నిర్వహించాల్సి ఉందని అయితే ఈ భూములు తమకే చెందుతాయని హక్కుదారులు హైకోర్టును ఆశ్రయించడంతో స్టే విధించినట్లు చెప్పారు. ఇప్పటికే దర్గాపై తమకు పూర్తి హక్కులు కల్పిస్తూ ఇటీవల హైకోర్టు తీర్పు వెలువరించిందని హక్కుదారులు తెలిపారు.

మెప్మా పీడీగా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న హన్మంత రెడ్డి

సూర్యాపేట అర్బన్: సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ సీహెచ్ హన్మంతరెడ్డి బుధవారం మెప్మా పీడీగా బాధ్యతలు స్వీకరించారు. హన్మంతరెడ్డికి మెప్మాపీడీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సమస్యల పరిష్కారానికి పోరుబాట

మునగాల: ప్రజాసమస్యల పరిష్కారానికి సిపిఎం పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి తెలిపారు. బుధవారం మునగాల మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మండల కమిటీ సభ్యుడు చందా చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి బుర్రి శ్రీరాములు, షేక్ సైదా, బచ్చలకూరి స్వరాజ్యం, దేశిరెడ్డి స్టాలిన్‌రెడ్డి, వి.వెంకన్న,బోళ్ల కృష్ణారెడ్డి, గోపయ్య, నాగయ్య, వెంకటాద్రి, నరసయ్య, వెంకటకోటమ్మ, జ్యోతి, సతీష్ పాల్గొన్నారు.

వర్షం 15% తక్కువే..



ఆత్మకూర్ మండల కేంద్రంలో నాట్లు వేస్తున్న కూలీలు

- వానాకాలంలో ఇప్పటి వరకు లోటు వర్షపాతమే నమోదు
- ఈ నెలపైనే రైతుల ఆశలు
- 2,65,332 ఎకరాల్లో వివిధ పంటలు సాగు
- వరుణుడు కరుణించకపోతే సాగైన పంటలు చేతికి అందడం కష్టమే



ఈ రైతు పేరు బట్టిపెట్టి శ్రీను. సొంతూరు ఆత్మకూర్(ఎస్). ఏటా జూన్, జూలైలో కురిసే వర్షాలకు గ్రామంలోని మత్రికుంటలోకి నీరు వచ్చేది. దీని కిందనే ఉన్న ఎకరం పొలం నాటుపెట్టేవాడు. ఈ వానాకాలం ఏ మాత్రం నీళ్లు కుంటలోకి రాలేదు. ఎకరం పొలం అలాగే ఉంది. వారం, పదిరోజుల్లో నీళ్లు రాకుంటే ఈ సారి వరి సాగుబంద్ చేయడమే.

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో రైతన్నల ఆశలు ఇక ఆగస్టు మాసంపైనే ఆధారపడి ఉన్నాయి. వానాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా సరైన వర్షాలు లేవు. ఈ సీజన్‌లో జిల్లాలో సరాసరి 15శాతం లోటు వర్షపాతం నమోదైంది. దీని కారణంగా వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 2,65,332 ఎకరాల్లో సాగైన వివిధ పంటలు పూర్తిస్థాయిలో చేతికి రావాలంటే ఈనెలలో కురిసే వానలపైనే ఆధారపడి ఉంది. సాధారణానికి మించి వర్షాలు కురవకపోతే బోరుబావులుసైతం వట్టిపోయే పరిస్థితి నెలకొంది.

అంచనాలు తలకిందులు

ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కారణంగా మంచి వర్షాలే ఉంటాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీంతో రైతాంగం సంబురపడగా.. ఈ అంచనాలను తలకిందులు చేస్తూ ఇప్పటి వరకు సరైన వర్షాలు కురవనేలేదు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో అసలు వాగులు, వంకలు సాగిన దాఖలాలు సైతం లేవు. కేవలం మోస్తరు వర్షాలే.. అదీ నెలలో 7, 8 రోజులకు మించి పడలేదు. జిల్లా గణాంక శాఖ అధికారుల లెక్కల ప్రకారం.. జూన్‌లో 95.5 మి.మీలు కురవాల్సి ఉండగా 44 శాతం లోటుగా 53.2 మి.మీ వర్షపాతం కురిసింది. జూలై చివరి వారంలో నాలుగు రోజుల పాటు మోస్తరు వర్షాలకు సాధారణం 162.7 మి.మీలకుగాను 2శాతం మించి 166.6 మి.మీల వర్షపాతం నమోదైంది. అయినా ఈ సీజన్ మొత్తంగా చూసుకుంటే జిల్లాలో సరాసరి 15 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

రైతుల్లో ఆందోళన

తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లా రైతాంగం ఆందోళన చెందుతోంది. ఈనెలలో వర్షాలు కురిసి.. చెరువులు నిండితే సరి లేదంటే సాగైన పంటలు సైతం చేతికొచ్చుడు కష్టమేనన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. సీజన్ ప్రారంభం అయినప్పటి నుంచి లోటు వర్షపాతం కారణంగా జిల్లాలో ఉన్న 1200 చెరువులు, కుంటలకు గాను కేవలం పది నుంచి 15 చెరువుల్లోకి మాత్రమే నీళ్లు వచ్చాయి. ఇక సాగర్, మూసీ ఆయకట్టు పరిధిలో ఉన్న చెరువుల్లోకి నీళ్లు వచ్చినా.. తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల పరిధిలోని చెరువులు నీటి జాడకోసం ఎదురు చూస్తున్నాయి. ఇదే పరిస్థితి నెలకొంటే ఆయా ప్రాంతాల్లో బోరుబావులు వట్టిపోయి నీటి ఆధారిత పంట వరి సాగు ప్రశ్నార్థకంగా మారనుంది. ఈ క్రమంలో జిల్లా రైతాంగం ఈనెలలో కురిసే వర్షాలపైనే గంపెడు ఆశలు పెట్టుకుంది.

బోర్లుపోయడం కష్టమే



వాతావరణం ఇలాగే ఉంటే బోర్లు పోయడం కష్టమే. చెరువులు, కుంటల్లోకి నీళ్లు వస్తేనే చివరి వరకు పొలాలు పారుతాయి. లేకుంటే ఇబ్బందులు తప్పవు. రెండెకరాలు నాటు పెడుతున్నాం. చేతికొచ్చినప్పుడు లెక్క.

– గడ్డం కేశయ్య, రైతు

పంట	అంచనా(ఎకరాల్లో..)	సాగైంది(ఎకరాల్లో)
వరి	4,85,125	2,11,096
పత్తి	91,000	50,236
ఇతర పంటలు	5,000	4,000

వానాకాలంలో ఇప్పటి వరకు వర్షపాతం(మి.మీ)

మండలం	కురిసింది	సాధారణం	లోటు
నాగారం	227	310	27
తిరుమలగిరి	201	328	39
తుంగతుర్తి	281	311	10
మద్దిరాల	207	284	27
నూతనకల్	275	274	0
జాజిరెడ్డిగూడెం	250	293	15
సూర్యాపేట	201	285	30
ఆత్మకూర్	231	267	13
మోతె	271	202	34(అధికం)
చివ్వెంల	202	240	16
పెన్‌పహాడ్	199	234	15
మునగాల	344	286	20(అధికం)
నడిగూడెం	301	272	11(అధికం)
అనంతగిరి	229	255	10
కోదాడ	257	259	01
చిలుకూరు	201	247	18
గరిడేపల్లి	183	236	22
నేరేడుచర్ల	131	234	44
పాలకవీడు	186	240	23
మఠంపల్లి	193	178	08(అధికం)
హుజూర్‌నగర్	137	257	47
మేళ్లచెరువు	234	229	02(అధికం)
చింతలపాలెం	117	220	47

'వరలక్ష్మి' సెల్ఫీలకు ఆహ్వానం

శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతం జరుపుకునే మహిళలూ.. మీ ఫొటోలను 'సాక్షి' పత్రికలో చూసుకోవాలను కుంటున్నారా.. మీరు పూజలో కూర్చున్న ఫొటో సెల్ఫీ తీసి ఈ కింద నంబర్‌కు వాట్సప్ చేయండి. శనివారం సంచికలో ప్రచురిస్తాం. లేటెస్ట్ సెల్ఫీ ఫొటోతో పాటు మీ పేరు, చిరునామా కూడా పంపాలి.

సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నంబర్
99489 38922



తెలంగాణ సాధనలో జయశంకర్ కీలక పాత్ర



కలెక్టరేట్‌లో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, అధికారులు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ కీలక పాత్ర పోషించారని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పేర్కొన్నారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. రాంబాబుతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు కోసం సాగిన ఉద్యమంలో పాలుపంచుకున్నారన్నారు. సూర్యాపేట జిల్లాను అభివృద్ధిలో రాష్ట్రంతో పాటు, దేశంలోనే ముందంజలో ఉంచడానికి ఉద్యోగులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ వి.వి. అప్పారావు, డీటీడీఓ శంకర్, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్లు సాయిగౌడ్, సంతోష్ కిరణ్, శ్రీలత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి అర్జీలు వేగవంతంగా పరిష్కరించాలి

భానుపురి (సూర్యాపేట) : భూభారతి అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్ లతో వెబ్ ఎక్స్ ద్వారా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. వీలైనంత ఎక్కువ సిబ్బందిని వినియోగించుకొని ప్రతి గ్రామాన్ని సందర్శించి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్ ఫుడ్ కమిషన్ చైర్మన్, మెంబర్లు గురువారం సూర్యాపేట జిల్లా సందర్శించనున్న సందర్భంగా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి సంక్షేమ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఈఓ అశోక్, డీఆర్‌డీఓ వీవీ అప్పారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, స్త్రీ, శిశు సంక్షేమ వయోవృద్ధుల శాఖ ఇన్‌చార్జి అధికారి దయానంద్ రాణి, ఎస్టీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ నాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి శంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ రెండో దశకు నీటి విడుదల ఎప్పుడు?

అర్వపల్లి: వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాకు ఎస్సారెస్పీ రెండో దశకు గోదావరి జలాల విడుదల ఈసారి ఆలస్యమవుతోంది. గత సీజన్‌లో ఈపాటికే గోదావరి జలాలను విడుదల చేశారు. అయితే ఈసీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీళ్ల అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ ప్రాజెక్టు నీటి సామర్థ్యం 80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 40 టీఎంసీల నీరు ఉంది. దీంతో ఇంతవరకు శ్రీరాంసాగర్ మొదటి దశకు కూడా నీటిని విడుదల చేయలేదు. కాగా ప్రాజెక్టులో 60టీఎంసీలకు పైగా నీళ్లుంటేనే సూర్యాపేట జిల్లాలోని రెండో దశకు నీటిని వదిలే అవకాశం ఉంటుందని నీటి పారుదల శాఖ తిరుమలగిరి డివిజన్ ఈఈ ఎం.సత్యనారాయణ తెలిపారు. వర్షాలు పడి శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఆశించిన స్థాయిలో నీళ్లు రాగానే జిల్లాకు ఈ సీజన్‌కు నీటిని విడుదల చేస్తామని చెప్పారు. ఎస్సారెస్పీ రెండో దశ కింద జిల్లాలో సుమారు 2.20 లక్షల ఎకరాలు సాగుకానున్నాయి. అయితే ఇంతవరకు నీటి విడుదలపై షెడ్యూల్ ప్రకటించలేదు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

పెన్‌పహాడ్: పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు విడుదల చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పబ్బతి వెంకటేశ్వర్లు డిమాండ్‌చేశారు. బుధవారం పెన్‌పహాడ్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అనాజీపురం, దోసపహాడ్, జంగంపడిగ, నాగులపహాడ్, నారాయణగూడెం, అన్నారం, అనంతారం పాఠశాలలను సందర్శించి డీటీఎఫ్ సభ్యత్వాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీ అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొచ్చెర్ల వేణు, జిల్లా పూర్వ అధ్యక్షుడు ఎం. దశరథరామారావు, మండల ప్రధాన కార్యదర్శి ఉమర్, నరేందర్, ఆనంద్‌భాస్కర్ పాల్గొన్నారు.

రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీలో రభస



తోపులాటకు దిగిన కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలను నిలువరిస్తున్న పోలీసులు

- కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట

ఆత్మకూర్.ఎస్(సూర్యాపేట) : సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండల పరిధిలోని నెమ్మికల్‌లో బుధవారం జరిగిన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు తోపులాడుకున్నారు. దీంతో కాసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. జిల్లా కలెక్టర్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి మాట్లాడుతుండగా.. జై జగదీష్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేయడంతో కాంగ్రెస్ కార్యకర్తలు వాదనకు దిగారు. జై దామన్న అంటూ పోటీగా కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేశారు.



రేషన్‌కార్డు ప్రొసీడింగ్ ఇస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ వేణారెడ్డి

ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి కేసీఆర్‌ను పొగుడుతూ బీఆర్ఎస్ హయాంలోనే ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందిందని చెబుతుండగా ఆయన ఉపన్యాసానికి కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుతగిలారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ఉద్యమం పేరుతో వందల మంది ప్రాణాలు బలిగొన్నదని, కేసీఆర్ కుటుంబం లక్షల కోట్లు కుంభకోణం చేసిందని విమర్శలకు దిగారు. కాంగ్రెస్ పార్టీ సోనియా గాంధీ పెట్టిన భిక్షతో అధికారం చేపట్టిన కేసీఆర్.. రాష్ట్రాన్ని దివాళాతీయించాడని ఆవేశంగా వేదికపైకి కాంగ్రెస్ కార్యకర్తలు దూసుకొచ్చారు. దీంతో ఇరు పార్టీల కార్యకర్తలు తోపులాటకుదిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు వచ్చి బీఆర్ఎస్ కార్యకర్తలను బయటకు పంపారు. కలెక్టర్ కలగజేసుకొని ఇది రాజకీయ వేదిక కాదని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన వేదికని సర్దిచెప్పారు. అనంతరం కలెక్టర్ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను, రేషన్ కార్డులను ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ వేణారెడ్డిలతో కలిసి పంపిణీ చేశారు.

రేషన్ కార్డు రాలేదని ఆందోళన చెందవద్దు

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): రేషన్‌కార్డు రాలేదని ఆందోళన చెందవద్దని, ఎప్పుడైనా దీనికోసం దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్‌లో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, సూర్యాపేట మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవ్ రావు, పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, డీఎస్‌ఓ మోహన్ బాబు, హౌసింగ్ పీడీ సిద్దార్థ ,తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ హసీం పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఒరగబెట్టిందేమీ లేదు: జగదీష్‌రెడ్డి

కేసీఆర్‌ను విమర్శించడం తప్ప ఒరగబెట్టింది ఏమీ లేదుఅని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. రసాభాస అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. చంద్ర బాబు చేసిన కుట్రలో భాగంగా కాళేశ్వరంను ఎండపెట్టారని ఆరోపించారు.బీఆర్ ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాళేశ్వరం నుంచి నీళ్లు తెచ్చి 24 గంటల కరెంటు ఇచ్చి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేశామన్నారు. ఉమ్మడి జిల్లాలో మూడు లక్షల టన్నుల ధాన్యం మాత్రమే పండే ఈ ప్రాంతంలో మూడు కోట్ల టన్నుల ధాన్యాన్ని పండించిన ఘనత బీఆర్ ఎస్ దే అని ఆయన అన్నారు. రేవంత్ హామీలపై ప్రభుత్వాన్ని నిలదీస్తే తట్టుకోలేకపోతున్నారన్నారు.

ఎస్సారెస్పీ నీటిని తెచ్చిన ఘనత దామోదర్‌రెడ్డిదే: వేణారెడ్డి

ఎస్సారెస్పీ రెండోదశ పనులను వేగవంతం చేయించి సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు ఎస్సారెస్పీ నీటిని తెచ్చిన ఘనత మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి దే నని సూర్యాపేట మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ జగదీష్‌రెడ్డి వెంట ఉన్న నాయకులు గోదావరి నీళ్ల కోసం దుబ్బతండా వద్ద గండ్లు కొట్టించిన విషయాన్ని మర్చిపోవద్దన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పరిపాలనలో ఒక రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. రైతులను మోసం చేసి కోట్ల కుంభకోణాలు చేసిన ఘనత జగదీశ్ రెడ్డి దేనని విమర్శించారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలకు వేళాయే..



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

- ఈ నెల రెండో వారంలో మండలస్థాయి, మూడో వారంలో జోనల్‌స్థాయి పోటీలు
- షెడ్యూల్ విడుదల చేసిన విద్యాశాఖ
- విద్యార్థుల్లో క్రీడానైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యం

హుజూర్‌నగర్ : పాఠశాల స్థాయి విద్యార్థి దశ నుంచే బాలబాలికలు వారికి ఇష్టమైన క్రీడలపై దృష్టి సారించేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది పోటీలను ఈనెలలోనే నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ప్రకటించింది. మండల స్థాయి పోటీలు ఈనెల రెండో వారంలో, జోనల్ స్థాయి పోటీలు ఈనెల మూడో వారంలో పూర్తి చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు రెండో వారంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించాలని ఆదేశించింది. ఆయా పోటీలు ఒక్కో స్థాయిలో రెండు రోజుల పాటు కొనసాగుతాయి. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించడం, ఆటల పోటీలు నిర్వహించి ఆయా క్రీడల్లో ప్రతిభావంతులను రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక చేయడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశం.

మూడంచెల పద్ధతిలో..

ఆటల పోటీలను మూడంచెల పద్ధతిలో నిర్వహిస్తారు. అండర్–14, అండర్–17 విభాగంలో పాఠశాల విద్యార్థులు, అండర్–19 విభాగంలో ఇంటర్ విద్యార్థులకు మండల, జోనల్, జిల్లా స్థాయిల్లో విడతల వారీగా పోటీలు నిర్వహిస్తారు. ఇందుకోసం జిల్లాను హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి జోన్లుగా విభజించారు. ఒక్కో జోనుకు ఒక క్రీడా కార్యదర్శి చొప్పున నలుగురు క్రీడా కార్యదర్శులను నియమించారు. ముందుగా అన్ని మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి పంపిస్తారు. ఉమ్మడి జిల్లాల వారీగా ఒక్కో క్రీడాంశంలో ఒక జట్టును ఎంపిక చేస్తారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై క్రీడల్లో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందిస్తారు. వీటితో విద్య, ఉద్యోగాలకు క్రీడాకోటా కింద 2 శాతం రిజర్వేషన్ల సదుపాయం కూడా ఉంటుంది.

అన్ని పాఠశాలల విద్యార్థులకు..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. జిల్లాలోని 1వ తరగతి నుంచి పదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలు 979 ఉండగా వాటిలో విద్యార్థులు 45,918 మంది ఉన్నారు. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 690 ఉండగా విద్యార్థులు 18,062 మంది ఉన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలు 78 ఉండగా విద్యార్థులు 3,079 మంది ఉన్నారు. ఉన్నత పాఠశాలలు 211 ఉండగా విద్యార్థులు 24,777 మంది ఉన్నారు. కేజీబీవీలు 18, ఆదర్శ పాఠశాలు 9, ఎంజేపీటీబీసీ 8, గురుకుల పాఠశాలలు 8 ఉన్నాయి. వాటిలో దాదాపు 15 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరే కాకుండా ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా ఈ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు.

క్రీడాంశాలు ఇవే..

కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, తైక్వాండో, కరాటే, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, నెట్ బాల్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, బాల్ బ్యాట్‌మెంటన్, షటిల్, టేబుల్ టెన్నిస్, చదరంగం, అథ్లెటిక్స్‌లలో అండర్- 14, 17, 19 బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తారు. పోటీల నిర్వహణకు ప్రభుత్వం ఒక్కో మండలాని రూ.10 వేలు కేటాయిస్తుంది. ఈనెల చివరి వరకు మండలస్థాయి పోటీలను పూర్తి చేయాలి. సెప్టెంబరులో రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభం అవుతాయి.

త్వరలో పోటీలను ప్రారంభిస్తాం



ఎస్‌జీఎఫ్ పోటీలను జిల్లాలో త్వరలో ప్రారంభిస్తాం. జిల్లాలో నాలుగు జోన్ల పరిధిలోని అన్ని మండలాల్లో పోటీలు నిర్వహించేలా ప్రణాళికలు తయారు చేశాం. రెండు రోజుల్లో ఆయా జోన్ల క్రీడా కార్యదర్శులను ఎన్నుకుంటాం. అనంతరం జిల్లాస్థాయి పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయికి క్రీడాకారులను ఎంపిక చేస్తాం.

–ఎం కిరణ్ కుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి

క్రీడల నిర్వహణకు ప్రభుత్వం సహకారం



ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణకు ప్రభుత్వం ఎనలేని సహకారం అందిస్తోంది. ఈ క్రీడల నిర్వహణ కోసం ప్రభుత్వం మండలాని రూ.10 వేల చొప్పున కేటాయిస్తున్నట్లు సమాచారం ఉంది. ఈ నిధులు వెంటనే విడుదల చేస్తే క్రీడల నిర్వహణ మరింత సులువు అవుతుంది. పాఠశాల స్థాయి క్రీడాకారులను జాతీయ స్థాయి క్రీడా కారులుగా తీర్చి దిద్దడమే ఈ క్రీడల ముఖ్య ఉద్దేశం.

–అయితగాని శ్రీనివాస్, పీఈటీప టీఎస్ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

నారుమడిపై కలుపు మందు పిచికారీ


రత్నవరంలో నారుమడిని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరం గ్రామానికి చెందిన గుండు సుభద్ర వ్యవసాయ క్షేత్రంలోని వరి నారుమడిపై గుర్తు తెలియని వ్యక్తులు కలుపు మందు పిచికారీ చేశారు. దీంతో ఆమె బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కంపాసాగర్ వ్యవసాయ పరిశోధన స్థానానికి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్.చంద్రశేఖర్, డాక్టర్ సంధ్యారాణిలను పిలిపించి, నారుమడిని పరిశీలించి, పొలంలోని నారు, మట్టి నమూనాలు సేకరించినట్లు ఎస్ఐ గందమళ్ల అజయ్ కుమార్ తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్, ఏఈఓ ఉప్పయ్య ఉన్నారు.

ఆర్ఎంపీ వైద్యుడిపై కేసు నమోదు

మునగాల: మునగాల మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు చంద్రమౌళి చేసిన చికిత్స వికటించడంతోనే బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన గోవింద వెంకటేశ్వర్లు(35) మృతిచెందాడని ఆయన సోదరుడు వీరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. వెంకటేశ్వర్లు గత మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా అతడి భార్య శిరీష మంగళవారం మండల కేంద్రంలోని ఆర్ఎంపీ వైద్యుడు చంద్రమౌళి క్లినిక్‌కు చికిత్స నిమిత్తం తీసుకువచ్చింది. చికిత్స పొందుతుండగా వెంకటేశ్వర్లు పరిస్థితి విషమించడంతో ఆయన సోదరుడు వీరబాబు సాయంతో కోదాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని కోదాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గల మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు చెప్పారు. మునగాలతో పాటు మృతుడి స్వగ్రామమైన బరాఖత్‌గూడెంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మహేందర్ (ఫైల్)

చింతపల్లి: అప్పుల బాధతో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం చింతపల్లి మండల పరిధిలోని వింజమూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వింజమూర్ గ్రామానికి చెందిన భీనమోని మహేందర్ (35)గ్రామంలో వ్యవసాయ పనులతో పాటు డ్రైవర్ గా చేస్తూ జీవనం సాగించేవాడు. తెలిసిన వారి వద్ద అప్పులు చేసి, వాటిని తీర్చే మార్గం లేక మానసికంగా కుంగిపోయాడు. దిక్కుతోచని స్థితిలో గత నెల 25న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. బంధువులు గమనించి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య నవీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

కృష్ణా తీరాన శైవ క్షేత్రం


పెద్దమునిగల్‌లోని కృష్ణా తీరంలో ఏర్పాటు చేసిన మహాశివుడి విగ్రహం

- ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పెద్దమునిగల్‌లోని కృష్ణా తీరం
- నాలుగేళ్లుగా గంగా హారతి

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని పెద్ద మునిగల్ కృష్ణా తీరంలో మహా శివుని విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. గ్రామస్తులు విరాళాల రూపంలో రూ.50లక్షలు సేకరించి శివాలయాన్ని నిర్మించి, మహాశివుడి ప్రతిమ ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా ఇక్కడ గంగా హారతి నిర్వహిస్తుంటారు. కార్తీక మాసంలో ఇక్కడ ప్రత్యేక పూజలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఒక వైపు కృష్ణా హారతి.. మరో వైపు మహా శివునికి ప్రత్యేక పూజలతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. కృష్ణా తీరంలోని వైజాగ్ కాలనీ అందాలు వీక్షించేందుకు వెళ్లే పర్యాటకులు పెద్దమునిగల్ కృష్ణా తీరాన గల మహాశివుని దేవాలయాన్ని సైతం దర్శించుకుంటుండడంతో భక్తుల రద్దీ పెరుగుతోంది.

గంగా హారతి ఇక్కడి ప్రత్యేకత

కార్తీక మాసంలో ప్రతి ఏడాది ఇక్కడ శివుడికి నిర్వహించే గంగా హారతి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. గ్రామస్తులందరం కలిసి సుమారు రూ.50లక్షలు విరాళాలు సేకరించి, మహాశివుడి దేవాలయాన్ని నిర్మించుకున్నాం. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతం గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతుంది.
– కోతి యుగేంధర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్

ముగిసిన పవిత్రోత్సవాలు


ఉత్సవమూర్తులు, పవిత్ర మాలలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న అర్చకులు, ఈఓ, అనువంశిక ధర్మకర్త

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలు బుధవారం పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా ముగిశాయి. ఈ నెల 4వ తేదీన ఆలయంలో శ్రీస్వామి వారి పవిత్రోత్సవాలకు అర్చకులు శ్రీకారం చుట్టారు. రెండ్రోజుల పాటు ఆలయంలో వివిధ పూజలు నిర్వహించిన అర్చకులు, బుధవారం ఉదయం ప్రాకార మండపంలోని యజ్ఞశాలలో హోమాది పూజలు జరిపించి, మహా పూర్ణాహుతి చేపట్టారు. ఉదయం 8.30గంటల నుంచి ద్వార తోరణ, ధ్వజ కుంభారాధన, చతుఃస్థానార్చన, మూలమంత్ర, పరివార శాంతి, ప్రాయశ్చిత హోమం, శాలాబలి నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను, పవిత్రమాలలను ఊరేగింపుగా ప్రధానాలయానికి తీసుకెళ్లారు. స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులు, సువర్ణ పుష్పార్చన ఉత్సవమూర్తులు, ఆళ్వారులకు పవిత్ర మాలలను ధరింపజేసి, ప్రత్యేక పూజలు చేపట్టారు. వేడుకల్లో ఆలయ ఈఓ వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, అర్చకులు, పారాయణీకులు, పండితులు, ఉద్యోగులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. పాతగుట్ట ఆలయంలో సైతం పవిత్రోత్సవాలను వైభవంగా ముగించారు.


ఆలయ యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

నేటి నుంచి నిత్యపూజలు పునఃప్రారంభం

యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో జరిగిన పవిత్రోత్సవాల సందర్భంగా మంగళ, బుధ వారాల్లో శాశ్వత, నిత్య కల్యాణం, సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం వంటి పూజలను ఆలయ అధికారులు రద్దు చేశారు. పవిత్రోత్సవాలు ముగిసిన నేపథ్యంలో గురువారం నుంచి ఈ పుజలను పునఃప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

విద్య నేర్పుతూ.. కళను పంచుతూ..


తిప్పర్తి పాఠశాలలో గోడలపై గీసిన చిత్రాలు

- విద్యార్థులకు చదువుతోపాటు చిత్రలేఖనం, యోగా, కోలాటంలో శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

తిప్పర్తి: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు తనకున్న కళను విద్యార్థులకు పంచుతున్నాడు తిప్పర్తి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు జల్లెల వెంకటేశ్వర్లు. చిత్రలేఖనం ద్వారా అర్థమయ్యే రీతిలో విద్యా బుద్ధులు నేర్పించడంతోపాటు, యోగా, కోలాటం తదితర రంగాల్లో విద్యార్థులకు మెళకువలు నేర్పుతూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

ఉద్యోగం వచ్చిన నాటి నుంచి నేటి వరకు..

గత 24 సంవత్సరాల సర్వీసులో ఇప్పటి వరకు మూడు పాఠశాలల్లో పనిచేశారు. ప్రథమంగా యాదగిరిగుట్ట మండలం యాదగిరిపల్లి గ్రామం నుంచి తన ఉద్యోగ ప్రస్థానం మొదలు పెట్టారు. అక్కడ నుంచి అనుముల మండల కుపాస్‌పల్లిలో చేశాడు. ప్రస్తుతం తిప్పర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. 27 పాఠశాలలో చిత్రాలు గీశారు. తాను పనిచేసిన పాఠశాలలోనే కాకుండా ఇతర పాఠశాలలకు కూడా ఆహ్వానం మేరకు వెళ్లి చిత్రాలు గీశారు. 2021లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక అయ్యారు. రాష్ట్ర కార్టూన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన గీసిన చిత్రాలు పాఠ్యపుస్తకాల్లో ప్రచురితమయ్యాయి. పీవీ నర్సింహరావు శత జయంతి సందర్భంగా ఆయన గీసిన చిత్రానికి 2023లో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో అవార్డు అందుకున్నారు. అదేవిధంగా వెంకటేశ్వర్లు గీసిన చిత్రాలు ఆస్ట్రేలియాలో తెలుగు అసోసియేషన్ రూపొందించిన 2024 క్యాలెండర్‌లో ప్రచురితమయ్యాయి.

నా కళను విద్యార్థులకు పంచుతున్నా



నాకు చిన్నతనం నుంచి చిత్రలేఖనం ఎంతో ఇష్టం. నేను పనిచేస్తున్న పాఠశాలతో పాటు వేరే పాఠశాలల్లో విద్యార్థులకు అర్థమయ్యేలా చిత్రాలను గీశాను. రాజకీయ నాయకులు, దేశ నాయకులు చిత్రాలను గీసి వారికి బహుమతులుగా అందజేశాను.
– వెంకటేశ్వర్లు, తిప్పర్తి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక అక్రమ డంపింగ్

మోత్కూరు : మోత్కూరులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో కొంత మంది ట్రాక్టర్ల యజమానులు ఇసుకను అక్రమంగా డంపింగ్ చేస్తున్నారు. పాటిమట్ల గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల కోసం సదర్శాపురం బిక్కేరు నుంచి ఇసుకను తీసుకువచ్చేందుకు తహసీల్దార్ అనుమతులు పొంది వాటికి అదనంగా తరలిస్తూ రహస్య ప్రాంతాల్లో అక్రమంగా డంపింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఇసుకను రాత్రి వేళల్లో లారీల ద్వారా తరలించేందుకు పాటిమట్ల కొత్త కాలనీ వద్ద ఇసుక డంపింగ్ చేశారని, అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పాటిమట్ల, సదర్శాపూర్ గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.


పాటిమట్ల కొత్త కాలనీలో అక్రమంగా డంపింగ్ చేసిన ఇసుక

హ్యాండ్లూమ్ స్టాల్‌ను సందర్శించిన మంత్రులు

సంస్థాన్ నారాయణపురం: చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూఢిల్లీలో గజం నర్మద హ్యాండ్లూమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను బుధవారం కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, ఢిల్లీ రాష్ట్ర మంత్రి పబిత్ర మార్గరీట వేర్వేరుగా సందర్శించారు. వస్త్రాలను మార్కెటింగ్ చేస్తున్న విధానంపై అడిగి తెలుసుకున్నారు. తయారీ, మార్కెటింగ్, అవార్డు తదితర అంశాలను చేనేత జౌళి శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ వారికి వివరించారు.


స్టాల్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్

స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- భువనగిరి కలెక్టర్ హనుమంతరావు

సాక్షి,యాదాద్రి : స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్ రావుతో కలసి అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేడుకలు నిర్వహిస్తున్నందున అందుకు అనుగుణంగా వేదిక, వీఐపీలు, అధికారులకు, ఇతరులకు అనుకూలంగా సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, ఆర్డీఓ కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామలింగం పాల్గొన్నారు.

రసాయన, ఔషధ ఫ్యాక్టరీలు తనిఖీ చేయాలి

జిల్లాలోని అన్ని రసాయన, ఔషధ ఫ్యాక్టరీలను తనిఖీ చేయాలని కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, జిల్లా ఫైర్ ఆఫీసర్, ఇండస్ట్రీస్ ఆఫీసర్లతో కలిసి సమావేశం నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా పాశ మైలారం ప్రాంతంలో జూన్‌లో జరిగిన భారీ విస్ఫోటన ఘటనకు గురైన తర్వాత భద్రతా సమస్యలపై చర్చించారు. జిల్లాలోని పరిశ్రమ పురోగతిని సమీక్షించేందుకు 19వ తేదీన రివ్యూ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

● తరగతి గదుల్లోకి వర్షపు నీరు



భూదాన్‌పోచంపల్లి : యాదాద్రి భువనగిరి జిల్లాలోని బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ పాఠశాల తరగతి గదిలోకి చేరిన వర్షపు నీరు

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

చౌటుప్పల్ : మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో బుధవారం బస్సు ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దండుమల్కాపురం గ్రామ శివారులో జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపునకు వెళ్తున్న ఏపీకి చెందిన బస్సు ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

చౌటుప్పల్ : చౌటుప్పల్‌లో బుధవారం వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా యాచారం గ్రామానికి చెందిన పాశం వంశీ(40) అనారోగ్యానికి గురవడంతో చికిత్స నిమిత్తం సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లాడు. అక్కడ చికిత్స పొందిన మరుసటి రోజు మంగళవారం చౌటుప్పల్‌లోని తన అత్తగారి ఇంటికి వెళ్లాడు. అదే రోజు తెల్లవారుజామున బాత్‌రూమ్ కోసమని వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో అతడి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ టీం దాడులు

భువనగిరిటౌన్ : భువనగిరి టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ టీం బుధవారం భువనగిరి పట్టణంలోని చేపట్టిన దాడుల్లో 70 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు భువనగిరి పట్టణంలోని బ్రహ్మణవాడ నివాసం ఉంటున్న కాసీం షేఖ్ ఇంట్లో దాడులు నిర్వహించారు. ఖాసీం షేఖ్ గంజాయిని వెస్ట్ బెంగాల్ నుంచి తీసుకువచ్చిన భువనగిరిలో విక్రయించేవాడని పోలీసులు గుర్తించారు. అతడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ రాధాకృష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, టీం బృందం నర్సిరెడ్డి, దుర్గయ్య, లింగస్వామి, నిహారిక, సురేష్ తనిఖీల్లో తదితరులు పాల్గొన్నారు.

నాగాయపల్లిలో మద్యపాన నిషేధం


మద్యపాన నిషేధం తీర్మాన పత్రాన్ని చూపుతున్న గ్రామస్తులు

తుర్కపల్లి(యాదగిరిగుట్ట రూరల్): తుర్కపల్లి మండలం నాగాయపల్లి, నాగయపల్లితండాలో మద్యపాన నేషేధానికి గ్రామస్తులు బుధవారం తీర్మానం చేశారు. ఇకపై గ్రామంలో, తండాలో మద్యం అమ్మకాలు అనుమతించబోని స్పష్టం చేశారు. మద్యం వల్ల కుటుంబాలు ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడుతున్నాయని.. మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఎవరైనా మద్యం విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు రూ.100000 జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

ప్రపంచ చెస్ ఛాంపియన్ ఆనంద్‌ను కలిసిన కరుణాకర్‌రెడ్డి


చెస్ ఛాంపియన్‌షిప్ ఆనంద్ కుటుంబ సభ్యులతో కరుణాకర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ సాధించిన విశ్వనాథ్ ఆనంద్‌ను జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కొసనం కరుణాకర్ రెడ్డి బుధవారం చెన్నైలో కలిశారు. చెన్నైలో జరిగిన చెస్ ఎగ్జిబిషన్ నేపథ్యంలో ఆయన అక్కడకు వెళ్లారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో చెస్ క్రీడాకారుడి పేరు మీద స్టేడియం ఏర్పాటు చేయడం అభినందనీయమని, త్వరలోనే తాను స్టేడియం సందర్శిస్తానని ఆనంద్ చెప్పినట్లు కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

ఫ్లైఓవర్‌కు పగుళ్లు


ఫ్లైఓవర్ స్లాబ్‌కు ఏర్పడిన పగుళ్లు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని పాతగుట్ట చౌరస్తా నుంచి వైకుంఠద్వారం వరకు వేసిన ఫ్లైఓవర్‌కు పగుళ్లు ఏర్పడ్డాయి. రోడ్డు విస్తరణలో భాగంగా గత ప్రభుత్వం భక్తులకు ఇబ్బందులు తలెత్తవద్దనే ఉద్దేశంతో రింగ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఫ్లైఓవర్‌ను నిర్మించింది. ఫ్లైఓవర్ అండర్ పాస్ నుంచి గాంధీ నగర్‌కు వెళ్లే దారిలో స్లాబ్‌కు పగుళ్లు రావడంతో ఆర్అండ్‌బీ అధికారులు దృష్టి పెట్టి, ప్రమాదం జరగకముందే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఊరంతా వెదజల్లే పద్ధతిలోనే వరి సాగు

- భిన్నంగా ఆలోచించిన నడిగూడెం మండలం రామాపురం గ్రామ రైతులు
- పెట్టుబడి ఖర్చులు తగ్గి కూలీల కొరత లేదంటున్న అన్నదాతలు


నడిగూడెం మండలం రామాపురంలో వరి విత్తనాలు వెదజల్లుతున్న రైతులు

నడిగూడెం: కాలానుగుణంగా వ్యవసాయంలో ఎప్పటికప్పుడు అనేక మార్పులు వస్తున్నాయి. ఇటీవలి కాలంలో వరి సాగులో ఖర్చులు పెరగడంతో పాటు కూలీల కొరత తీవ్రంగా ఉంది. దీంతో విత్తనాలు వేసే దగ్గర నుంచి ఎరువుల వాడకం, కలుపు తీయడం, పంట కోసే వరకు ఒక్కో రైతు ఒక్కో విధంగా వ్యవసాయం చేస్తున్నారు. కానీ సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామాపుంర గ్రామ రైతులు మాత్రం అందుకు భిన్నం. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రామాపురం రైతులు వరి సాగు భిన్నంగా చేపట్టారు. దమ్ము చేసిన పొలంలో మొలకెత్తిన వరి విత్తనాలను నేరుగా చల్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు ఏకంగా ఊళ్లోని రైతులంతా వెదజల్లే పద్ధతిలోనే వరి సాగు చేస్తున్నారు. రామాపురంలో బోర్లు, బావులు, సాగర్ ఎడమ కాల్వకు అనుబంధంగా కొమరబండ మేజర్ కాల్వ, ఆర్–9 ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటి సౌకర్యం ఉంది. ఉన్న నీటి వనరులతో ఏకంగా ఆ ఊరంతా దాదాపు 3500 ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలోనే వరి సాగు చేస్తున్నారు. ఈ విధానంలో వారం రోజుల ముందుగానే పంట కోతకు వస్తుందని, నారు పెంపకం, నారు పీకడం, నాట్లు వేసే పని ఉండదు కాబట్టి సాగు ఖర్చు రూ.2500 నుంచి రూ.3500 వరకు తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. ఈ విధానంలో ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనం సరిపోతుంది. ఈ పద్ధతిలో కాండం ధృడంగా పెరుగుతుందని, రైతుకు ఇష్టమైన ఏ రకమైనా సాగు చేసుకోవచ్చని, నీటి యాజమాన్యం కూడా చాలా సులువు అని వ్యవసాయాధికారులు అంటున్నారు.

మూడెకరాల్లోనూ వెదజల్లే పద్ధతిలో..



మూడెకరాల్లో వరి సాగు చేపట్టాను. అది కూడా వెదజల్లే పద్ధతిలో నేరుగా వరి విత్తనాలు చల్లాను. దీంతో విత్తన మోతాదు, నారు పెంచే ఖర్చులు, నాట్లు వేసే ఖర్చులు తగ్గాయి. దాదాపు రూ.3000 వరకు ఆదా అయ్యాయి. కూలీల సమస్య కూడా లేదు.
– మారిశెట్టి నర్సింహారావు, రైతు, రామాపురం

వెదజల్లే పద్ధతి చాలా సులువు



రోజురోజుకూ వ్యవసాయంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు ముందుకు వెళ్లాఇ. దమ్ము చేసిన తర్వాత నేరుగా పొలంలో విత్తనాలు వెదజల్లడం వలన మొక్క ధృడంగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. కూలీల సమస్యను కూడా అధిగమించవచ్చు.
– రాయపు దేవప్రసాద్, మండల వ్యవసాయాధికారి, నడిగూడెం